ప్రజాశక్తి

ఆదివారం 23 జూన్ 2024

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి



రాజకీయ కట్టడికేనా..?

- అయ్యన్నను స్పీకర్‌గా పంపడంపై సర్వత్రా చర్చ
- బాబు, లోకేష్ వ్యూహమేనని వ్యాఖ్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టారు. 1983లో తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రవేశం చేసిన ఆయన ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి అనకాపల్లి ఎంపీగా విజయం సాధించారు. ఐదు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. తన అభిప్రాయాలను ఏ మాత్రం దాచుకోకుండా విలక్షణంగా చెప్పే లక్షణం కలిగిన ఆయన్ని శాసనసభాపతిగా పంపడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. రాజకీయంగా కట్టడి చేయడానికే అన్న వారూ లేకపోలేదు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నుంచి కె.ప్రతిభాభారతి, తమ్మినేని సీతారాం శాసనసభాపతులుగా పనిచేశారు. తాజాగా ఈ ప్రభుత్వంలో అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా ఎన్నికయ్యారు. సభాపతి స్థానం గౌరవప్రదమైనదైనా, ప్రత్యక్ష రాజకీయాలకు దూరం పాటించాల్సివుండడంతో రాజకీయ భవిష్యత్తుకు సవాలుగా మారనుంది. సభాపతిగా పనిచేసిన వీరెవరూ తరువాత ఎన్నికల్లో గెలవలేదు. ప్రత్యక్ష రాజకీయాలకు అయ్యన్నను దూరంగా ఉంచాలన్న టిడిపి అధినేత చంద్రబాబు వ్యూహంలో భాగంగానే పార్టీలో సీనియర్ నాయకుడైన ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదన్న చర్చ కూడా కొద్దికాలంగా నడుస్తోంది.

మంత్రి పదవి ఇవ్వకపోయినా చంద్రబాబు మనసెరిగిన అయ్యన్న గతంలో చూపిన కోపం ప్రదర్శించకుండా ఈసారి సర్దుకుపోయారు. మంత్రులుగా కొత్త వారికి అవకాశమివ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు మాట్లాడారు. భవిష్యత్తులో టిడిపి కళ్లెం లోకేష్ చేతిలో పెట్టాలన్న ఆలోచనతో తమ మాట జవదాటని వారిని ఏరుకొని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారు. అందుకని సీనియర్లుగా వున్నవారిని పక్కన బెట్టి కొత్త వారికి, తన విధేయులకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. అయ్యన్నకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై పార్టీలోనూ చర్చ సాగడంతో అనూహ్యంగా అయ్యన్నను సభాపతిగా తెరమీదకుతెచ్చారు. ప్రత్యక్ష రాజకీయాలకు అయ్యన్నను దూరంగా వుంచాలన్న బాబు ఆలోచనలో భాగంగానే స్పీకర్ స్థానంలో కూర్చొబెట్టి, అయ్యన్న సీనియార్టీకి గౌరవమిచ్చినట్లు చేయగలిగారు. పార్టీలో చంద్రబాబు నిర్ణయాలతో ఏకీభవించలేనప్పుడు అంతర్గతంగానూ, కొన్ని సందర్భాల్లో బహిరంగంగానూ అయ్యన్న తన అభిప్రాయాలు మిగతా 2లో..

విశాఖ కలెక్టర్ మల్లికార్జునపై బదిలీ వేటు



మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కలెక్టర్ల బదిలీల్లో భాగంగా శనివారం రాత్రి విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునపై బదిలీ వేటు పడింది. ఆయన హయాంలో వివిధ భూ కుంభకోణాలు బయటపడడం, గత ప్రభుత్వ పెద్దలు, ప్రముఖ ఉన్నతాధికారుల పేర్లు బయటకు రావడంతో మల్లికార్జునకు ఎక్కడా ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు. జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే అల్లూరి జిల్లా కలెక్టర్‌గా దినేష్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ అక్కడ పనిచేసిన విజయసునీత బదిలీ అయ్యారు.

అతిసార కట్టడికి చర్యలు

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పరిధిలో అతిసార వ్యాధి ప్రబలకుండా పటిష్టమైన జాగ్రత్తలతో కూడిన చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టిన 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు నియంత్రణా చర్యలపై ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాధన్, ఇతర ఉన్నతాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అతిసార వ్యాధితో మిగతా 2లో..



సాంకేతికలోపంతో విశాఖలో నిలిచిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

వందేభారత్‌ను వెంటాడుతున్న సమస్యలు

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

రాజకీయ కట్టడికేనా ?

చెప్పడం బాబుకు ఇబ్బందిగా వుంది. రాజకీయంగా అయ్యన్నను బలహీనపర్చేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడలో అనకాపల్లి ఎంపీ టికెట్‌ను అయ్యన్న తనయుడు విజయ్‌కు ఇవ్వకపోవడం, నర్సీపట్నం ఎమ్మెల్యే టికెట్‌ను కూడా విజయ్‌కు ఇవ్వడానికి నిరాకరించడం వంటి పరిణామాలు అంతర్లీనంగా చోటుచేసుకున్నాయి. మాడుగుల నియోజకవర్గంలో జరిగిన చంద్రబాబు సభలో తన తనయుడు విజయ్‌కు ఎంపీ టికెట్ ఇస్తే తనను ఆదరించినట్లు విజయ్‌నూ అభిమానించాలని అయ్యన్న కోరారు. ఇది చంద్రబాబుకు నచ్చలేదు. లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో స్థానికేతరుల ఫ్లెక్సీలు పెట్టడంపై అయ్యన్న తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇవన్నీ చంద్రబాబు, లోకేష్ మనసులో మెదలడంతో అవకాశం వచ్చినప్పుడు హుందాగా తప్పించాలన్న ప్రయత్నంలో అనేక తర్జనభర్జనల మధ్య శాసన సభాపతిగా అయ్యన్నను ముందుకు తెచ్చినట్లు తెలుస్తోంది.

అతిసార కట్టడికి చర్యలు

పాటు మలేరియా, డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులు నగరంలో ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డిసిల్టింగ్ ఆఫ్ డ్రైన్స్ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని, నగరంలో 1019 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన గెడ్డల్లోని పూడికలు తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 2890 కిలోమీటర్ల మేర ఉన్న చిన్న కాలువలలో పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను కోరారు. జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల సమన్వయంతో నగర పరిధిలో ఉన్న బిఆర్‌టిఎస్ కారిడార్లలో, హైవే రోడ్లపై, బీచ్ రోడ్డులలో వర్షపు నీరు నిల్వ ఉండబోయే ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి సరఫరా విభాగం, పబ్లిక్ వర్క్స్ విభాగం సహాయక ఇంజినీర్లు వారి పరిధిలోని మురుగు నీటి కాలువలు, కల్వర్టులు గుండా వెళ్లే తాగునీటి పైపులను మూడు రోజుల్లో గుర్తించి వాటి లీకులను అరికట్టే చర్యలను చేపట్టాలని ఆదేశించారు. చిన్నపిల్లలలో అతిసార వ్యాధి సోకే అవకాశం ఉన్నందున సచివాలయాల పరిధిలో వాలంటీర్ల ద్వారా ఐదు సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి నివేదిక సమర్పించాలని డిపిఒ. ఎంవిడి.ఫణిరాంను కమిషనర్ కోరారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షా సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు, జోనల్ కమిషనర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, యుసిడి ప్రాజెక్టు ఆఫీసర్, డిపిఒలు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి నాలుగో జోన్‌లోని వాణిజ్య సముదాయాలు, అంబేద్కర్ కల్యాణ మండపం, పూర్ణా మార్కెట్, రెల్లి వీధి రోడ్డు పక్కనగల ఫిష్ మార్కెట్, రైతుబజార్, తదితర మార్కెట్ల ఆశీలు మూడు సంవత్సరాలు గుత్తకిచ్చేందుకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించేందుకు జోనల్ కమిషనర్ పివివిడి.ప్రసాదరావు ప్రకటన ఇవ్వడం పట్ల కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న హర్షం వ్యక్తం చేశారు. అయితే వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటించాలని కోరారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన కెవిపిఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య సముదాయాల కేటాయింపులో స్థానికులకు, ఆయా వృత్తులు, పనులు చేసుకునే వారికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. వేలం పారదర్శకంగా జరిగి యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాహాలు, వేసవి కాలం నేపథ్యంలో విభిన్న రూపాల్లో, వినూత్న వస్త్రాలతో 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్' గ్రీన్ పార్క్ హోటల్‌లో శనివారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు సాగే ఈ ఎక్స్‌పోలో దేశంలోని అనేక ప్రాంతాల విభిన్న సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే ఉత్పత్తులను ప్రదర్శించారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపుతో వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైన వాటిని ఒకేచోట అమ్మకాలకు అందుబాటులో ఉంచారు. మహారాష్ట్రకు చెందిన సొగసైన పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ చందేరి, మహేశ్వరి సిల్క్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన బలుచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ సిల్క్, లినెన్ శారీ కాంతా వర్క్ చీరలు వగైరా ఒకే చోట కొలువుదీరాయి. దుప్పట్లు, సల్వార్ మెటీరియల్‌లు కూడా ఇక్కడ ఉన్నాయి. బీహార్‌కు చెందిన టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్, గుజరాత్‌కి చెందిన సాంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడుకు చెందిన కాంజీవరం, ఎంబ్రాయిడరీ సిల్క్‌తో పాటు జమ్మూ తావి కాశ్మీర్ సిల్క్ చీరలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. బెనారస్ పట్టు చీరలు, జమదాని షిఫాన్ చీరలు, ఉత్తరప్రదేశ్ లక్నో చికన్ వర్క్, రాజస్థాన్ బంధిని, బందేజ్ ,హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు కూడా ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలో ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎక్స్‌పో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విస్తృతంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం కోరాపుట్-కొత్తవలస సెక్షన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, కార్యాచరణ సామర్థ్యం, ప్రయాణికుల సౌకర్యాల వంటి పలు అంశాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్బంజన్ రాయ్ ఉన్నారు.

ఇంకా చోద్యం చూస్తారా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఉక్కుపై ఇంత జరుగుతున్నా ఇంకా చోద్యమేనా ?' అంటూ విశాఖ వాసులు కూటమి పాలకులను ప్రశ్నిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామిక రంగంలో జీవనాడైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకంపై స్టీల్ యాజమాన్యం చేపడుతున్న అడ్డగోలు చర్యల పట్ల గెలిచిన నేతల నుంచి ఒక్కమాటైనా సవ్యంగా రావట్లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ప్లాంట్‌ను నెమ్మదిగా దివాళా తీయించేసి అమ్మేయాలనే కేంద్రంలోని బిజెపి సర్కారు వ్యూహానికి రాష్ట్రంలోని పార్టీలు వత్తాసు పలికేలా వ్యవహారం చేస్తున్నాయి.

తాజాగా ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నయ్‌లలో ఖరీదైన ఆఫీసు స్థలాలు, భవనాలను, స్టాక్ యార్డులను అమ్మేసే స్కెచ్ వేశారు. వాటి మార్కెట్ విలువ సుమారు రూ.476.18 కోట్లుగా ఉంటుందని లెక్కలు వేశారు. ప్లాంట్‌లో రోజుకో సమస్యను సృష్టించి అమ్మేసేందుకు కేంద్రం పావులు కదుపుతోంది. వర్కింగ్ కేపిటల్ కోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టేసే ప్రణాళికలను అమలు చేసే చర్యలను శరవేగంగా యాజమాన్యం తీసుకుంటోంది.

మాటలకూ, చేతలకూ ఎంత తేడా?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాన పార్టీల నాయకుల వ్యవహార శైలి చూస్తే మాటలకు చేతలకు పొంతన కానరావడం లేదు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో ఉండబోదంటూ మీడియాతో చెప్పారు. కానీ కేంద్ర చర్యలు తేడాగా ఉన్నాయి. కాషాయ పార్టీ విధానమే గందరగోళపరచడం. ఒక్కో నాయకుడు ఒక్కో మాట, పూటకో విధానంతో సాగడం తెలిసిందే.



బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన నేతలు ప్లాంట్‌లో జరుగుతున్న తాజా ప్రమాదకర పోకడలను అడ్డుకునే యత్నం చేయడం లేదు. ఇటీవల యాజమాన్యం ఆస్తులను విక్రయించేసి ప్లాంట్‌ను ఒట్టి గోడలతో నిలబెట్టే దిశగా ప్రణాళిక అమలు చేయడంలో ప్రధాన పార్టీలన్నీ బిజెపితో కలిసిపోయాయా ? అనే అనుమానం కలుగక మానదు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రోజులు గడుస్తున్నా ఉక్కు వ్యవహారంపై మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. ఆస్తుల వేలం జరుగుతున్నా, ప్లాంట్‌ను ఎండగట్టే చర్యలను యాజమాన్యం తీసుకుంటున్నా గెలుపొందిన టిడిపి కూటమి పార్టీల నేతల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రమైన గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి కూటమి నుంచి బరిలోకి దిగిన టిడిపి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందారు.

గతంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఇక్కడ నుంచి ప్రజలు, కార్మికులకు ఎన్నికల సభలో పిలుపునిస్తూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలంటే పల్లాను, విశాఖ పార్లమెంట్ నుంచి భరత్‌ను భారీ మెజారిటీలతో గెలిపించాలని కోరారు. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అటు ఎమ్మెల్యేగా పల్లాను, ఇటు ఎంపీగా శ్రీభరత్‌ను భారీ మెజారిటీతోనే గెలిపించారు.

కాబట్టి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేపడుతున్న కార్మిక వ్యతిరేక, ప్లాంట్ వ్యతిరేక చర్యలపై ఎప్పటికప్పుడు స్పందించాల్సిన కర్తవ్యం టిడిపిపై ఉంది. పైగా పల్లా శ్రీనివాసరావుకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు కూడా దక్కడం చూస్తే ప్లాంట్ ప్రైవేటీకరణకు ఒక్క అడుగూ ముందుకు సాగకుండా అడ్డం పడాల్సిన ప్రధాన బాధ్యత ఆయనపైనే ఉండనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

విశాఖ సహకార బ్యాంకు వ్యాపార లక్ష్యం రూ.8 వేల కోట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వ్యాపార లక్ష్యాన్ని రూ.8 వేలు కోట్లుగా నిర్ణయించామని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ద్వారకానగర్ ఐదో లైనులోగల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.7,350 కోట్ల మైలురాయిని అధిగమించి తాజా లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. 2023-24 నాటికి 1,04,865 మంది సభ్యులు, రూ. 352.61 కోట్లు షేరుధనంతో భారతదేశంలోనే అతి పెద్ద సహకార అర్బన్ బ్యాంకులలో ఒకటిగా స్థానం సంపాదించుకుందన్నారు. దేశంలోని నాన్ షెడ్యూల్ సహకార బ్యాంక్‌లలో అతి పెద్ద బ్యాంక్‌గా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ నిలిచి సహకార సూత్రాలను త్రికరణ శుద్ధిగా పాటించడంలో తన ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. బ్యాంక్ సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత జీవిత బీమా వుందన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించిన రుణ గ్రహీతలకు 4 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2596 మందికి రూ.5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. 108 వ వార్షిక మహా జనసభ నిర్ణయం మేరకు రూ. 33.56 కోట్లను సభ్యులకు వారి షేరు ధనంపై



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

డివిడెండ్ గా బ్యాంకు చెల్లించిందన్నారు. ఈ ఏడాది కొత్తగా ఐదు బ్రాంచిలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ నెల 20న శీలానగర్‌లో 51వ బ్రాంచి ఏర్పాటు చేశామని తెలిపారు. చిత్తూరు, బాపట్ల, నరసరావుపేట, తాడేపల్లిగూడెంలలో బ్రాంచిలు ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది కాలంలో కోటికిపైగా డిజిటల్ కార్యకలాపాలు ద్వారా రూ.5714 కోట్లు టర్నోవర్ జరిగిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.87.79 కోట్ల లాభం సాధించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో డైరెక్టర్లు మానం ఆంజనేయులు, జెవి.సత్యనారాయణ మూర్తి, ఎజె స్టాలిన్, ఉప్పలపాటి పార్వతి దేవి, సిఎ వీరఘంట చంద్రశేఖర్, కామరాజు, జనార్ధనరావు, చెరువు ఆదినారాయణ శాస్త్రి, రమణారావు, కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణారావు, సిఇఒ పివి.నరసింహామూర్తి పాల్గొన్నారు.

రాజ్యాంగేతర శక్తులు వైజాగ్ ఫిలిం సొసైటీ నుండి వైదొలగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, మధురవాడ : ఐదు సంవత్సరాలుగా విశాఖపట్నం ఫిలిం సొసైటీని తమ ఆధీనంలో ఉంచుకుని నాశనం చేసిన రాజ్యాంగేతర శక్తులు వెంటనే ఆ సొసైటీ నుంచి వైదొలగాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం తిమ్మాపురంలోని వైజాగ్ ఫిలిం సొసైటీ కల్చరల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొట్లకొండపై 15 ఎకరాల ప్రాంతాన్ని వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌కు ఇచ్చారని, అక్కడ శంకుస్థాపన కూడా జరిగిందని తెలిపారు. అయితే అది ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో మరలా ఐదు ఎకరాల స్థలాన్ని రామానాయుడు స్టూడియో సమీపంలో ఇచ్చారని చెప్పారు.

మత్స్య సంపద నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

విశాఖ కలెక్టరేట్ : మత్స్య సంపద నాణ్యతా ప్రమాణాలు పాటించడంపై ఎంపెడ అనుబంధ సంస్థ నెట్ ఫిష్ ఆధ్వర్యంలో శనివారం ఫిషింగ్ హార్బర్‌లో శిక్షణ కార్యక్రమం చేపట్టారు. మత్స్యకారులు పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఏసిపి రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ద్వారకా ఏసిపి రాంబాబు అన్నారు. తోటగరువులోని ఎర్నిమాంబ కల్యాణ మండపంలో శనివారం మాదక ద్రవ్యాల వాడకం, వాటి పర్యావసనం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైం, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వీటిని అరికట్టేందుకు స్థానికంగా ఉన్న ప్రజలు పోలీసులతో సహకరించాలని కోరారు. పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి మాట్లాడుతూ మన పిల్లల వ్యవహార శైలిని తల్లిదండ్రులు అనునిత్యం గమనించాలన్నారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ, డ్రగ్స్ మూలాలను కనుక్కొని వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఆరిలోవ సిఐ గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుడుమూరు గోవిందరావు, గాడి సత్యం, పోలారావు, దువ్వి తాతారావు, ఆటో రిక్షాకార్మిక సంఘం నాయకులు కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏసిపి రాంబాబు

పేకాట స్థావరాల వద్ద తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలంలో పేకాట స్థావరాల ప్రాంతాలను శనివారం పోలీసులు తనిఖీలు చేశారు. ఆనందపురం సిఐ టివి తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్ఐలు సంతోష్ కుమార్, శివ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. పేకాట స్థావరాలకు సంబంధించిన అనుమానిత స్థలాలైన దిబ్బడిపాలెంలోని ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ లే-అవుట్ వద్ద, గంభీరం రోడ్డులో గుత్తా శ్రీనివాసరావుకు చెందిన చందన హోటల్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ స్థావరాల సమీపంలో ఉన్న వాహనాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ, ఎక్కడా పేకాట ఆడరాదని, ఎవరైనా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృత్రిమ గర్భధారణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : ఆవుల్లో కృత్రిమ గర్భధారణ ప్రక్రియపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు భీమిలి మండలం దాకమర్రి పశు వైద్యాధికారి డాక్టర్ జి.కాంతికిరణ్ తెలిపారు. లింగ నిర్ధారణ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. లింగ నిర్ధారణ వీర్యం ఒక డోసుకు రూ.500 చెల్లించాలని సూచించారు. ఎస్ఎస్ఎస్ వీర్యం ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేసినప్పటికీ ప్రయోజనం లేనట్లయితే ఉచితంగా మరో సారి వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పటికి కూడా ఆడ దూడ జననం లేకుంటే చెల్లించిన రుసుమును తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు.



యోగా చేస్తున్న దివీస్ ఉద్యోగులు, సిబ్బంది

శోధ్‌గంగాలో ఏయూకు 6వ స్థానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : శోధ్‌గంగాలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో 6వ స్థానం లభించింది. ఏయూ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి పాల్గొని గ్రంథాలయ సిబ్బందిని అభినందించారు. అందరి సహకారంతో నేడు మెరుగైన స్థానాన్ని సాధించడం వీలైందన్నారు. శతాబ్ది వేడుకలకు దగ్గరవుతున్న నేపథ్యంలో ఇటువంటి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం ఆనందాన్నిస్తోందన్నారు. గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించడం, మౌలిక వసతుల కల్పన, సుందరీకరణ, నూతనంగా రీడింగ్ రూమ్, పరిసరాలలో పచ్చదనం, టాయిలెట్స్ నిర్మాణం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న డిఇఒ చంద్రకళ

డిఇఒ ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : పెందుర్తి మండల పరిధిలోని పెందుర్తి, వేపగుంట మండల పరిషత్ పాఠశాలలను డిఇఒ ఎల్.చంద్రకళ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పుస్తకాలు, కిట్స్ పంపిణీ గురించి విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. అనంతరం గుర్రపాలెం, బందవానిపాలెం పాఠశాలలను డిఇఒ సందర్శించారు. బడికి పోతాం కార్యక్రమం ద్వారా బడి బయట పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చేవిధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు డిఇఒ సూచించారు.

ఏయూలో ప్రిన్సిపల్స్ నియామకం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా సైకాలజీ విభాగ ఆచార్యులు ఎంవిఆర్.రాజు నియమితులయ్యారు. శనివారం ఆయన ఆచార్య కె.శ్రీనివాసరావు నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఆర్.పద్మశ్రీ నియమితులయ్యారు. శనివారం ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారిద్దరిని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు అభినందించారు.

చురుగ్గా బస్టాప్ నిర్మాణ పనులు



బస్టాప్ కోసం జరిగిన నిర్మాణ పనులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పాత బస్టాండ్ వద్ద జివిఎంసి నిధులు రూ.40 లక్షలతో చేపట్టిన బస్టాప్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బస్ బే పేరిట బస్టాప్ నిర్మాణం జరుగుతోంది. గతంలో ఇక్కడ ఉండే చిన్న పాటి బస్ షెల్టర్‌ను, బెంచీలను నేల మట్టం చేశారు. దీని స్థానంలో బస్ బే పేరుతో అధునాతన పద్ధతిలో బస్టాప్‌ను నిర్మిస్తున్నట్లు జివిఎంసి ఒకటో జోన్ ఎఇ సుమన్ శనివారం తెలిపారు. పాత మీ సేవా కేంద్రం వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు

డయేరియా నిర్మూలనకు జాగ్రత్తలు : డిపిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో డయేరియా భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విశాఖ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డయేరియా నిర్మూలనకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాలలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మురుగు నీరు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.అప్పలనాయుడు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ శ్రీనివాసరావు

అపోలోలో నాన్ సర్జికల్ ట్రాన్స్‌కాథెటరీ రీప్లేస్‌మెంట్



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : వివిధ రోగాల కారణంగా హైరిస్క్ ఉన్న ఇద్దరు రోగులకు ట్రాన్స్‌కాథెటరీ రీప్లేస్‌మెంట్‌ను అపోలో వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రిలో శనివారం యాజమాన్య ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 63 ఏళ్ల మధుమేహం, రక్తపోటు, కిడ్నీ, ఆసిటిస్ వ్యాధులతో పాటు కాల్సిఫిక్ అర్టిక్ స్టెనోసిస్‌తో బాధపడుతున్న విశాఖ నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు అపోలో ఆసుపత్రికి వచ్చి వైద్యుడు డాక్టర్ బారువాను సంప్రదించారని తెలిపారు. డాక్టర్ బారువా గుండె వైద్యుల బృందంతో చర్చించి రోగికి బృహద్ధమని కవాటం ట్రాన్స్‌కాథెటరీ రీప్లేస్‌మెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం రోగి ఆరోగ్యం మెరుగుపడింది.

తీవ్రమైన బృహద్ధమని సంబంధ స్టెనోసిస్‌తో బాధపడుతున్న 72 ఏళ్ల మహిళా రోగికి కూడా డాక్టర్ బారువా, అతని కార్డియాలజీ బృందం ట్రాన్స్‌కాథెటరీ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టిఎవిఆర్‌ల) విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బారువా మాట్లాడుతూ, అపోలో ఆసుపత్రి వైద్యుల నైపుణ్యం, అంకితభావంతో పాటు ఎంచుకున్న అధునాతన కార్డియాక్ కేర్ విధానం రోగులకు ఉత్తమ ఫలితాలను అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ కిషోర్ పాణిగ్రహి, డాక్టర్ జైదీప్ త్రివేది, డాక్టర్ చక్రధర్, డాక్టర్ శశాంక్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవి, డాక్టర్ సునీల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలకృష్ణ, సిఒఒ రామచంద్ర, డిజిఎం విజయ సారధి పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఎమ్‌డి మురళీకృష్ణ చెప్పారు. యోగా దినోత్సవం సందర్భంగా దివీస్ సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, యోగాను రోజువారీ వ్యాయామంలో భాగంగా అనుసరించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ, జనరల్ మేనేజర్లు ఎంఎస్ఎన్.రావు, వైఎస్.కోటేశ్వరరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

కరాస : స్థానిక మర్రిపాలెం రీజనల్ పాస్‌పోర్టు ఆఫీస్ కార్యాలయంలో యోగా ట్రైనర్ కెవిఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యాన యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ పాస్‌పోర్టు ఆఫీసర్ విశ్వాంజలి గైక్వాడ్ మాట్లాడుతూ, దైనందిన జీవితంలో యోగా చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. సిబ్బంది చేత పలు యోగాసనాలు వేయించారు.

శిర్లపాలెంలో వాసవి క్లబ్ సేవలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో శనివారం గంధవరం వాసవి క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీధి కూరగాయల వ్యాపారులు ఐదుగురికి గొడుగులు, 40 మంది పాఠశాల విద్యార్థులకు (1, 2, 10వ తరగతి) నోట్‌బుక్, పెన్, పెన్సిల్, షార్పనర్, ఎరేజర్, ట్రాఫిక్ పోలీసులకు 10 మాస్కులు, 1 టవల్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి 5 కేజీల బెల్ బ్రాండ్ రైస్, దీపం నూనె, ఒక వాల్ క్లాక్, నేత్ర దానానికి ఒక సభ్యుడు అంగీకారం తెలుపుతూ ఫారంపై సంతకం చేయడం, ఒకరికి తోపుడు బండి అందించడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ తాటికొండ వెంకటరావు, కుసుమంచి పాపారావు, ఆర్‌సివి.మన్మధరావు, జెసి.గుప్తా, జిబిసిబి సన్యాసిరావు, నాళం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని నెట్

నిలిచిన పౌర సేవలు
ఇది గాజువాక జోనల్ కార్యాలయంలో దుస్థితి



ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయంలో మూడు రోజులుగా బిఎస్ఎన్ఎల్ నెట్ పనిచేయకపోవడంతో పౌర సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి పన్నులు, వాటర్ బిల్లుల చెల్లింపులు నిలిపివేయడంతో ప్రజలు కార్యాలయానికి వచ్చి వెళ్లిపోతున్నారు. కొత్త ఇళ్లకు పన్ను వేయడం, ఫైల్స్ స్కానింగ్ కాకపోవడంతో రెవెన్యూ అధికారుల దగ్గర ఫైల్స్ పేరుకు పోతున్నాయి. ప్రతిదీ ఆన్‌లైన్ కావడం వల్ల నెట్ లేనిదే పనులు ముందుకు సాగడం లేదు. కొంతమంది బ్యాంకు లోను కోసమని ఇంటి పన్నులు అప్పటికప్పుడు వేసుకుందామని అధికారుల దగ్గరికి వచ్చినప్పటికీ నెట్ పనిచేయక పనులు కావడంలేదు. గాజువాకుల రోడ్లు తవ్వడం వల్ల కొన్నిచోట్ల బిఎస్ఎన్ఎల్ లైన్లు తెగిపోయిన కారణంగా ఈ సమస్య ఏర్పడిందని బిఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. మరో రెండు రోజుల వరకు బిఎస్ఎన్ఎల్ పూర్తిస్థాయిలో సౌకర్యం కల్పించలేమంటున్నారు. ప్రతిరోజూ కార్యాలయంలో క్యాష్ కౌంటర్ తెరిచి ఉంటే ప్రజలు పన్నులు కట్టడానికి అవకాశం ఉంటుంది. నెట్ పనిచేయని కారణంగా ప్రజలకు ఇబ్బందులతోపాటు జివిఎంసికి ఆదాయం తగ్గుతుందని పలువురు అంటున్నారు. ఖాళీ స్థలం పన్నులు చాలావరకు పెండిగ్‌లో ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. ఖాళీ స్థలం పన్నులు చెల్లించినదే నిర్మాణాలకు అనుమతి రాదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై జోనల్ కమిషనర్ సన్యాసినాయుడును వివరణ కోరగా వీలైనంత తొందరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ముదపాక రైతులు

ముదపాక రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పెందుర్తి మండలం ముదపాకలో 2016 టిడిపి ప్రభుత్వంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని గ్రామ రైతు సారిపల్లి గణేష్ కోరారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2016లో టిడిపి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణ చేపట్టడంతో ముదపాక గ్రామ రైతులందరూ 350 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. భూముల సర్వే సమయంలో అప్పటి విఆర్ఒ ప్రలోభాలకు లొంగి అసలు భూమి లేని వారి పేర్లను, ఎకరా ఉన్న వారికి మూడు నుంచి ఐదెకరాలు ఉన్నట్లు చేర్చారని వివరించారు. దీని వల్ల నిజమైన రైతులకు అన్యాయం జరగడంతో అప్పట్లో విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మళ్లీ సర్వే చేయించారని తెలిపారు. భూమి లేకుండా పేర్లు నమోదైన వారిని తొలగించి నిజమైన రైతులకు ల్యాండ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు జారీచేశారని తెలిపారు. దీన్ని సహించలేని తొలగింపబడిన వ్యక్తులు హైకోర్టులో కేసులు వేశారని చెప్పారు. తప్పుడు పేర్లు గల ఓ వర్గం వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం విశాఖపట్నంలో ఉన్న లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి సహకారంతో ముదపాక పంచాయతీపైనా, తహసీల్దార్, ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌పై ఆ దినపత్రికలో నిరాధారమైన రాతలు రాస్తున్నారని ఆరోపించారు. వారి స్వార్థం కోసం ముదపాక రైతులను బలిపశువులను చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైకోర్టులో కేసులు వల్ల రైతులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వారు అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించి రైతులకు అండగా నిలబడాలని, బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదుపాక గ్రామ రైతులు పాల్గొన్నారు.


వెలగపూడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన కుమారుడు ప్రతాప్

ఘనంగా వెలగపూడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జన్మదిన వేడుకలు శనివారం నగరంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ఆరిలోవ : జివిఎంసి 11, 12, 13 వార్డుల్లో వెలగపూడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. 11వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి, అధ్యక్షులు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు ఆధ్వర్యాన గాంధీనగర్, శ్రీరాంనగర్, టిఐసి పాయింట్ ప్రాంతాల్లో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో వార్డు అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు, పేపర్ నాయుడు, బాలస్వామి, యల్లమిల్లి సురేష్, సుధాకర్, జనసేన, బిజెపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో...

విశాఖపట్నం : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు జన్మదిన వేడుకలు తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం సీనియర్ నాయకులు చోడే వెంకట పట్టాభిరామ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాప్, పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్, కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు, 20వ వార్డు ఇన్‌ఛార్జి పోతనరెడ్డి ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు.

గంటా నివాసానికి తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగుదేశం నాయకులు విశాఖపట్నంలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేసి మొదటి సారిగా విశాఖ వచ్చిన సందర్భంగా పద్మనాభం మండలం నుంచి బైకులు, కార్లపై శనివారం సాయంత్రం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

సమానత్వం కోసం ఉద్యమం


సదస్సులో సమానత్వంపై నినదిస్తున్న పిఒడబ్ల్యు ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పురుషులతో సమానత్వం కోసం మహిళలు దీర్ఘకాలిక ఉద్యమం చేయాలని స్వతంత్ర జర్నలిస్టు, ప్రముఖ యూట్యూబర్ సి.వనజ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) రాష్ట్ర స్థాయి సదస్సు నగరంలోని పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. "మహిళా ఉద్యమ నిర్మాణంలో పిఒడబ్ల్యు 50 సంవత్సరాల ప్రయాణం – వర్తమానంలో మహిళా ఉద్యమ కర్తవ్యాలు" అనే అంశంపై సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందస్సులో వనజ మాట్లాడుతూ, జీవితంలో మహిళలు అనేక రకాల హింసలను భరిస్తున్నారన్నారు. 'వాడు మగాడు ఏమైనా చేస్తాడు' అనే ధోరణి ఇంకా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ఆడపిల్లల్ని ఒంటరిగా బయటకు పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారని తెలిపారు. పేరుకే సమానత్వం గురించి మాట్లాడుతుంటామని, సమాజంలో అది లేదని చెప్పారు. ఉన్న చట్టాలను నిర్వీర్యం చేయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వస్త్రాలంకరణ సరిగా లేకనే మహిళలపై పురుషులు దాడి చేశారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మహిళలను హింసిస్తున్న వారిని చట్టాలు ఏమీ చేయలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సభకు అధ్యక్షత వహించిన పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు గంగాభవాని మాట్లాడుతూ, ఆంధ్రాలో మహిళలపై దాడులు అత్యాచారాలు ఇటీవల ఎక్కువయ్యాయన్నారు. పిఒడబ్ల్యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కె.సంధ్య మాట్లాడుతూ, హింసకు వ్యతిరేకంగా పిఒడబ్ల్యు నిర్మించిన ఉద్యమాన్ని నేటి మహిళలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.విష్ణు, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి వర్తమాన ఉద్యమ లక్ష్యాలను వివరించారు. అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సదస్సులో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, హెచ్ఆర్ఎఫ్ నాయకులు అనురాధ, సిఎంఎస్ నాయకులు లలిత, వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు పద్మ, మణి, భారతి పాల్గొన్నారు.

పప్పల రామ్మోహనరావుకు సన్మానం



రామ్మోహనరావును సన్మానిస్తున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యులు

ప్రజాశక్తి -మాధవధార : రైల్వే డివిజనల్ కో–ఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన పప్పల రామ్మోహనరావును శనివారం మాధవధారలోని భరద్వాజ క్షేత్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యాన సన్మానించారు. శ్రీ మాధవ యువజన సమాజం కో–ఆర్డినేటర్ పప్పల రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలాపల్లి ప్రసాద్ మాట్లాడుతూ, పప్పల రామ్మోహనరావు రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. రైల్వేలో కార్మిక సంక్షేమం కోసం అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళింగ వెల్ఫేర్ అధ్యక్షులు పేడాడ నరసింహారావు, శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాలరావు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పప్పల శ్రీహరి, ఎఐఆర్ఎఫ్ జోనల్ సెక్రెటరీ బి.దామోదరరావు, స్టేట్ చైల్డ్ రైట్ కమిషన్ నెంబర్ గొండు సీతారాం, 50, 51వ వార్డుల టిడిపి అధ్యక్షులు టిడిపి సనపల వరప్రసాద్, సనపల కీర్తి, ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ, మాధవధార కలింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘంలో విశాఖకు కీలక పదవులు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం (తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర కమిటీ ఎన్నికలు మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. విశాఖ జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవులకు ఎన్నికయ్యారు. తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసాచార్యులు, కోశాధికారిగా బండారు శ్రీనివాసరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షుడుగా పి.శేషుబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ, కొత్త కార్యవర్గం రెండేళ్లపాటు అధికారంలో కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, హక్కులు కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామని చెప్పారు.

డెంగీ, మలేరియాపై సమాచారమివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : సీజనల్ వ్యాధులతోపాటు మలేరియా, డెంగీ కేసులపై ఎప్పటికప్పుడు జిల్లా మలేరియా అధికారితో సంప్రదించాలని, ఐఆర్ఎడి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయంలో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిసి, పిఎన్‌డిటి యాక్ట్, ఫారం–ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్లు, రెన్యువళ్లు, రిపోర్టులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందచేయాలని ఆదేశించారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి–సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని చెప్పారు.

జిల్లా మలేరియా అధికారి తులసిరాజ్ మాట్లాడుతూ, రోగుల ఆధార్ అడ్రస్ కాకుండా ప్రస్తుత నివాస అడ్రస్ నమోదు చేయాలని, దానివల్ల వారిని సులభంగా గుర్తించి మెరుగైన సేవలు అందించుటకు వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, డాక్టర్ యామినిశాంతి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో అవకతవకలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

న్యాయ విచారణ జరిపించాలని, దేశవ్యాప్తంగా మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ కొన్ని రోజులుగా నీట్ పరీక్ష స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా కేంద్రంలో మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)కు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారని తెలిపారు. నీట్‌లో అక్రమాలపై మోడీ సర్కారు కించిత్తు పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని, దీనిని బట్టి నీట్ స్కామ్‌ను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు చూస్తున్నట్లు అర్థమవుతుందని పేర్కొన్నారు. బిజెపి, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగా నీట్ స్కాం జరిగిందని ఇప్పటి వరకు నమోదైన కేసులను బట్టి తెలుస్తోందన్నారు. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షను 24 లక్షల మంది రాశారని, నేడు వారి భవిష్యత్తు అగమ్యగోచరం కావడం బాధాకరమన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై తక్షణమే సుప్రీం, లేదా హైకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని, పరీక్షల నిర్వహణ నుంచి ఎన్‌టిఎను తప్పించాలని, దేశవ్యాప్తంగా మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివాజీ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో మావనహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి విజయ్‌భాస్కర్

పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో అన్ని పాఠశాలలకు ఇంతవరకు వచ్చిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయ భాస్కర్ ఆదేశించారు. స్థానిక పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన అన్ని ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఇండెంట్లు పెట్టాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు అన్ని ప్రైవేటు యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు తప్పనిసరిగా నెల వారి పాఠశాలల పర్యటన షెడ్యూలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, ఎంఈఓలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా గాజువాక జిఆర్‌కె మ్యూజికల్స్ అధినేత జి.ఈశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక పొట్టి శ్రీరాములు భవనంలో నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకుంది. గాయకులు పలు సినీ గీతాలను, భక్తి గీతాలు, హిందీ గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి ముస్తఫా సౌండ్ సిస్టంను, వైజాగ్ ట్రాక్ సురేష్ ట్రాక్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సంగీత దినోత్సవం పురస్కరించుకొని పలువురు సినీ గాయకులను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిఎంఎల్ నరసింహమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో గాయని గాయకులు శ్రీనివాసరావు, అజయ్ లక్ష్మి ప్రియ, లీల, కనకమహాలక్ష్మి, లావణ్య, జగదీశ్వరి, సూర్య కుమారి, రమేష్, శ్రీనివాసరావు, రాము, శంకర్రావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 30 మంది గాయనీ గాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎపి అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడును విజయవాడలో శనివారం టిడిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యన్న పాత్రుడు స్పీకర్ స్థానానికే వన్నె తెస్తారన్నారు. స్పీకర్ స్థానాన్ని ఉత్తరాంధ్రాకు చెందిన బీసీ నేతకు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు.

మునగపాక : స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుని మునగపాక గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ శనివారం విజయవాడలోని అతని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటకోట విజయ్, ఆడారి కన్నబాబు, పెంటకోట శ్రీరామమూర్తి, వేగి దేవతనాయుడు, విల్లూరి సాయిరాం పాల్గొన్నారు.


అయ్యన్నతో టిడిపి మునగపాక మండల నాయకులు

నూకరత్నానికి నాగజగదీష్ నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి సీనియర్ కార్యకర్త పలక రమేష్ తల్లి పలక నూక రత్నం ఇటీవల మృతి చెందగా, స్థానిక కోట్ని వీధిలో వారి స్వగృహంలో శనివారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ హాజరై నూతరత్నం ఆమె చిత్రపటానికి పువ్వులు సమర్పించి నివాళు లర్పించారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల వెంకటరావు, కోట్ని రామకృష్ణ, కరణం శ్రీనివాసరావు, కోట్ని కొండలరావు, కోట్ని ఈశ్వరరావు, ఇల్లపు శ్రీను, డొంక దుర్గ నాయుడు, మల్ల గణేష్, సత్యనారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

24 నుండి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి బదులుగా ఈ నెల 24వ తేదీ నుండి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించుటకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టమ్) ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యల పరిష్కార కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చేవారికి తాగునీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని ఎడిఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం నిర్వహించిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జూన్ మాసంలో ఆశించిన వర్షపాతం కన్నా 25 నుండి 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రైతులు తమకు కావాల్సిన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు సమకూర్చుకోవడంలో బిజీగా ఉన్నారని, నారుమడులు తయారు చేసుకోవడానికి సమాయత్తమౌతున్నారని పేర్కొన్నారు. సరైన వర్షాలు నమోదైతే రైతులు జూలై మొదటి వారం నుండి నారుమడులు తయారు చేసుకుంటారని వివరించారు. ఏడిఆర్ డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆర్ఎఆర్ఎస్, కెవికెల ద్వారా ఆర్‌జిఎల్ - 2537 వరి విత్తనం, ఎలమంచిలి -66 నువ్వు విత్తనాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. వ్యవసాయ అధికారుల కోరిక మేరకు ఆర్ఏఆర్ఎస్‌లో ఎంటియు -1262 రకానికి రెండు ఎకరాలలో విత్తనాన్ని పండించి రైతులకు అందజేస్తామని ఏడిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్‌రావు, అనకాపల్లి, విశాఖ జిల్లాల డీఏవోలు, ఏడీఏలు, ఏవో, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి, కెవికెలు, ఏఆర్ఎస్ కొక్కిరాపల్లి శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై చర్చించారు.


ఎడిఆర్‌గా బాధ్యతలు చేపట్టిన ముకుందరావును సత్కరిస్తున్న దృశ్యం

పారిశుధ్య కార్మికుల జీతాల బకాయిలపై చర్చలు విఫలం

ఆందోళన కొనసాగింపు

ప్రజాశక్తి- కశింకోట

ఐదు నెలలుగా బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ కసింకోట మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆందోళనబాట పట్టిన నేపథ్యంలో శనివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తమ జీతాల బకాయిలు కోసం పారిశుధ్య కార్మికులు ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళన రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. శనివారం కసింకోట పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి, గ్రామ సర్పంచ్‌కి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా ఎంపిడిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేసి ఇఒపిఆర్‌డికి వినతి పత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన ఇఒపిఆర్‌డి పంచాయతీ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి వేతనాల సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కార్మిక నేతలతో చర్చలు జరిపారు. ఐదు నెలల బకాయిలకు గాను కేవలం రెండు నెలలు వేతనాలు మాత్రమే ఇస్తామని, అది కూడా నాలుగైదు రోజుల తర్వాత ఇస్తానని, మిగతా బకాయి జీతాలు 15 రోజుల తర్వాత ఇస్తామని గతంలో చెప్పిన మాదిరిగానే చెప్పారు. దీంతో కార్మికులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఇప్పటికే అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నామని, మొత్తం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అయినా పంచాయతీ కార్యదర్శి ఇంతకుమించి తానేమీ చేయలేనని చేతులెత్తేశారు. దీంతో ఆందోళన కొనసాగించాలని కార్మికులు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.రామాజీ, జి వెంకటరమణ, కోశాధికారి కె దేవుడు, నాయకులు ఆదిలక్ష్మి, లక్ష్మణరావు, రాములు, ఇతర పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కల నెరవేరేనా..?

- ఏర్పాటు చేయాలని అనేక ఏళ్ల నుండి డిమాండ్
- పట్టించుకోని గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేదలు, కార్మికుల పిల్లలు
- కొత్త ప్రభుత్వం, నూతన ఎమ్మెల్యేపై కోటి ఆశలు



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-పరవాడ

అనకాపల్లి జిల్లాలో పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పరవాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా? ఎంత మంది శాసన సభ్యులు ఎన్నికైనా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. నూతన ప్రభుత్వం, కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పారిశ్రామికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. మండలంలోని నిర్వాసితులు, జిల్లా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి ఇక్కడి పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. అరకొర వేతనాలతో పని చేసే కార్మికులు, కష్టజీవులు తమ కుటుంబాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో నివాసముంటున్నారు. వీరి పిల్లల ఉన్నత చదువులు, ప్రధాన డిగ్రీ చదువులకు అవసరమైన కళాశాలలు పరవాడలో లేవు.

మండలంలో పలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత డిగ్రీ చదవాలంటే మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో చదువులు మధ్యలోనే నిలిపివేయాల్సి వస్తోంది. ఎంతోకొంత ఆర్థికస్థోమత ఉన్న వారు గాజువాక, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లోని కాలేజీల్లో చేరుతున్నారు. వీరు రోజూ బస్సుల్లో వెళ్లి రావాల్సిన దుస్థితి నెలకొంది. దీనితో ఉదయం, సాయంత్రం కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించి అలసిపోయి చదువుపై దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతంలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు ప్రతిరోజూ వెళ్లకుండా ఇక్కడే చదువుకొనే అవకాశం ఉంది. అందువల్ల పరవాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ స్థానికులు, కార్మికుల కుటుంబాల నుండి ఎప్పటి నుంచో వినిపిస్తోంది. కాని గతంలో ఇక్కడి నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులుగాని, గత ప్రభుత్వాలు గాని ఈ డిమాండ్‌ను పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం పరవాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఇక్కడి నుండి ఎన్నికైన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇందుకు చొరవ చూపాలని స్థానికులు, కార్మికులు కోరుతున్నారు.



నూతనంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

విశ్వబ్రాహ్మణ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. సంఘం సమావేశం బుచ్చయ్యపేట రామాలయం వద్ద జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిలకుర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బిలకుర్తి సత్యనారాయణ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం చోడవరం నియోజకవర్గం గౌరవ అధ్యక్షులుగా లక్కోజు నారాయణరావు, బుచ్చయ్యపేట మండల అధ్యక్షునిగా దారోజు ఈశ్వరరావు, కన్వీనర్‌గా కడియం శ్రీనువాస్, కో-కన్వీనర్‌గా పిలియన నరేష్, ఉపాధ్యక్షులుగా ఎండపల్లి తులసిరావు, ప్రధాన కార్యదర్శి చుక్క లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా వంగలి నాగేశ్వరరావు, కోశాధికారిగా గెద్దనాపల్లి నాగేశ్వరరావు, సలహా కమిటీ సభ్యులుగా లక్కోజి ఈశ్వరరావు, ఎండపల్లి నానిబాబు, సభ్యులుగా చుక్కా సత్తిబాబు, పొంగలి రాజారావు, చుక్కా సత్యనారాయణ, కొప్పోజు సత్తిబాబు, దారోజు కన్నయ్య, ఎండపల్లి రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట, నేతవానిపాలెం, దిబ్బిడి, బంగారుమెట్ట, కోయిలపల్లి, పెద్ద మదిన, గున్నంపూడి, పెద్ద కందిపూడి గ్రామాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - యలమంచిలి

16వ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా ఆదివారం నియోజకవర్గానికి వస్తున్న సుందరపు విజయకుమార్‌కు ఘనస్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించడానికి పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్‌కుమార్‌తో కలిసి విజయకుమార్ ఆదివారం ఏటికొప్పాక మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకొని అక్కడి నుండి భారీ ఊరేగింపుగా పులపర్తి జంక్షన్ చేరుకుంటారని పార్టీ కార్యాలయ ప్రతినిధి సతీష్ తెలిపారు. అక్కడ యలమంచిలి చేరుకొని, పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారని, తరువాత గాజువాక బైపాస్‌రోడ్డు, నారాయణపురం, కొత్తూరు మీదుగా అచ్చుతాపురం చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడి పోలీస్ స్టేషన్ ఎదురు మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు శాసన సభలో అడుగుపెట్టిన సందర్భంగా ఆ పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం నెహ్రూ చౌక్ జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరికీ స్వీట్లు పంచి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో అడుగు పెట్టిన సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గం టిడిపి నాయకుల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపి శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన బీసీ నేత అయ్యన్నపాత్రుడుకి కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలరపు త్రినాథ్, బొడి వెంకటరావు, సురే సతీష్, పిడి ప్రసాద్, రాజన అప్పారావు, యల్లపు శ్రీనివాసరావు, ఆకుల నానాజీ, గొర్లి శేఖర్, సందిన చిన్న బాబు, వేగి కృష్ణ, పీలా లోకేష్, షేక్ ఖాదర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామం అంగన్వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, తిమ్మరాజుపేట సర్పంచ్ భీశెట్టి కృష్ణారావు మాట్లాడుతూ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము, రమణ, పచ్చికోర నర్సింగరావు, దొడ్డి భాస్కర్, అంగన్వాడి టీచర్ తులసి, ఆయా రమణమ్మ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



యలమంచిలిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో శనివారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ వ్యవసాయ డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వర్తి విత్తనాలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. సబ్సిడీ విత్తనాలు కోసం రైతులు ఆధార్, భూమి పాస్ పుస్తకం తెచ్చుకొని ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాజోలు సన్నాలుతో పాటు సాంబమసూరి, ఎంటియు 1318, ఎంటియు 1224, ఎంటియు 1061, ఎంటియు 1064 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాధికారి మోహనరావు, ఎఇఒ దేముడు, అరుణ, స్వాతి, రైతులు ఆదిబాబు, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, పెయ్యల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని తోటాడ, మూలపేట పంచాయతీల పరిధిలోని రైతులకు మూలపేట సర్పంచ్ బీసెట్టి గంగ అప్పలనాయుడు, తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు శనివారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఆర్జీఎల్ 42, సోనామసూరి 16 ఎంసియు 20 బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ భవాని, రెండు పంచాయితీల కూటమి నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాలం వ్యాధుల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ పట్నాయక్

ప్రజాశక్తి-కె.కోటపాడు

వర్షాకాలంలో వచ్చే అతిసారం తదితర వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో పట్నాయక్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అంగన్వాడీ, ఇంజనీరింగ్ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేపట్టాలని, కుళాయిల ద్వారా వచ్చే నీటి శాంపుల్స్‌ను ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ బ్లీచింగ్ చల్లాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జూలై 1 నుండి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించాలన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి- సబ్బవరం : మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని స్థానిక ఎస్సై రాజశేఖర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలను వినియోగించరాదని, మంచి సత్ప్రవర్తనతో చదువులపై దృష్టి సారించాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాల జోలికి పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి- అనకాపల్లి : సభా సంప్రదాయాలు పాటిస్తానని ప్రమాణం చేసిన 24 గంటలు కాకుండానే, అసెంబ్లీ స్పీకర్‌గా బీసీ సామాజిక తరగతికి చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడును ఎన్నికైన నేపథ్యంలో సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి సభకు గైర్హాజరు అవ్వడం బీసీలు పట్ల వైసిపి అధినేత జగన్ చిత్తశుద్ధి లేదని తేటతెల్లమైందని శాసనమండలి మాజీ సభ్యులు బుద్ధ నాగజగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో వివిధ వర్గాలకు 56 కార్పొరేషన్లు పెట్టి వారికి నిధులు, విధులు ఇవ్వకుండా పెత్తందారుల పాలన కొనసాగించారని గుర్తు చేశారు. వైసిపి రాష్ట్ర కమిటీ మొత్తం రెడ్డి సామాజిక వర్గంతో నిండిపోయిందని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పదవుల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన పోస్టులన్నీ తన సామాజిక వర్గం వారి కేటాయించి, ప్రాధాన్యత లేని వాటికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చేవారని తెలిపారు.

గురుకులంలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా గురుకుల పాఠశాలకు వచ్చి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 6వ తరగతిలో ఎస్‌సి -29, ఎస్‌టి-1, బిసి -1, 7వ తరగతిలో ఎస్‌సి -3, 8వ తరగతిలో ఎస్‌సి -2, ఓసి -1, 9వ తరగతిలో ఎస్‌సి -4 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. వీటి కోసం ఈ నెల 28న ఉదయం 10 నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ గ్రేస్ తెలియజేశారు.

ఎంపీ సిఎం రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎంపీ సిఎమ్.రమేష్‌ని విశాఖపట్నం జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎమ్‌పిడిఓ ఉప్పలపాటి కూర్మారావు ఆధ్వర్యాన శనివారం అనకాపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి చిరు సన్మానంతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పివిఎస్‌ఎన్.రాజు, జలవనరుల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అప్పలరాజు పాల్గొన్నారు.

వంగలి సమస్యలపై ఎంపీకి వినతి

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామ పంచాయతీ సమస్యలపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను వంగలి పంచాయత సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్, పలువురు గ్రామస్తులు శనివారం వినతిపత్రం అంజదేశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయంలో వారు కలిశారు. సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆకుల గణేష్, జెట్టి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా... పరిష్కారం కాని సమస్యలు

-శిథిలావస్థలో వంతెనలు, రోడ్లు

సౌకర్యాలు లేక ముందుకు సాగని గృహ నిర్మాణాలు

- నూతన ప్రభుత్వమైనా.. పరిష్కరించేనా?



అసంపూర్తిగా ఉన్న పందూరు వంతెన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా పేరుకు పోయిన సమస్యలను నూతన ప్రభుత్వమైనా పరిష్కరిస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలో ప్రధాన సమస్యలైన అసంపూర్తిగా ఉన్న జల్లూరు వంతెనతో ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పందూరు వంతెనతో పాటు గిరిజన గ్రామాలైన కోదండరామపురం రోడ్డు నిర్మాణం, రామచంద్రపురం శివారు ఆళ్ళుముయ్యి పాలెం, నిధులు మంజూరైనా నిర్మాణం చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేసిన వంతెన రోడ్డు, రాజుపేట, అన్నవరం, చౌడువాడ, పందూరు నుంచి అడ్డు రోడ్డు వెళ్లేందుకు చిద్రమైన రహదారులు నిర్మించాల్సి ఉంది.



రాళ్లు తేలిన అడ్డురోడ్డు

గత ప్రభుత్వం హయంలో నిర్మించిన జగనన్న కాలనీల వద్ద ఎక్కడా కూడా మౌలిక వసతులు కల్పించ లేదు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఏటికొప్పాక చక్కెర కర్మాగారం పున్ణ ప్రారంభం పట్ల నూతన ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది.మండల వ్యాప్తంగా టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన సంపద సృష్టి కేంద్రాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ నిధులు గత ప్రభుత్వం వివిధ రూపాలుగా మళ్ళించడంతో గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, సహా మౌలిక వసతుల కల్పనకు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు పలు సందర్భాలలో అధికారులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పట్ల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాలకు పలు గ్రామాలలో శాశ్వత భవనాలు లేక పోవడంతో సిబ్బంది, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు వీటిపై దృష్టి సారించాలి.

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పట్ల పలు విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ, సచివాలయ అధికారుల సమన్వయ లోపంతో వివిధ సమస్యలపై పరిష్కారం కోసం దరఖాస్తుదారులు సచివాలయ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.టిడిపి ప్రభుత్వంలో ఇంటింటికి శుద్ధ జలాల ప్లాంట్ నిమిత్తం తహసిల్దార్ కార్యాలయం వద్ద లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వృధాగా వదిలేశారు. ప్రస్తుతం మండలంలో సరైన శుద్ధి నీటి ప్లాంట్ లేక పోవడంతో ప్రజలు బోరుబావి నీటిని తాగుతున్నారు. శుద్ధి జలాలను ఇంటింటికి పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

మండల వ్యాప్తంగా ఇన్ని సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా గత వైసిపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. ఎన్నడూ లేని విధంగా టిడిపి రికార్డు స్థాయిలో మండలంలో మెజార్టీ సాధించింది. కొలువు దీరిన ప్రభుత్వమైనా మండలంలోని సమస్యలను పట్టించుకుని త్వరితగతిన పరిష్కరించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ పుప్పల అప్పలరాజు ఓ ప్రకనటలో కోరారు. మాడుగుల టౌన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరిపోక పోవడంతో వోల్టేజ్, హై ఓల్టేజ్ లతో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం హెచ్చుతగ్గులతో కూడిన కరెంటు సరఫరాతో ఇటీవల మాడుగుల్లోని గణేష్ కాలనీలో టీవీలు, ఫ్యాన్లు, ట్యూబ్లైట్లు ఎక్కువగా కాలి పోయాయన్నారు. మాడుగుల టౌన్‌లో 6 నుండి 8 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అర్బన్ కాలనీ, గణేష్ కాలనీ, నూకాలమ్మ కాలనీలో ఈ సమస్య ఎక్కువగా ఉందని విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరారు.

మాడుగుల టౌన్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం దష్ట్యా వచ్చిన ఫిర్యాదుల మేరకు తప్పనిసరిగా తగిన రీతిలో సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పలనాయుడు తెలిపారు.ఈ మేరకు ఆయన ఆయా ప్రాంతంలో ఉన్న ట్రాన్సార్మర్స్ వద్ద ట్రాన్సిస్టర్ రీడింగ్స్ పరిశీలన చేశారు. అవసరమైన అదనపు ట్రాన్సార్మర్లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. వర్షాలకు ఉరుములు, మెరుపులతో విద్యుత్ హెచ్చు తగ్గులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, న్యూట్రల్ ఎర్త్ ఉన్నట్లయితే నష్టం జరిగే ప్రమాదం తగ్గుతుందని సూచించారు.



సంబరాల్లో పాల్గొన్న టిడిపి నేతలు

టిడిపి నేతల సంబరాలు

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం శాసనసభ్యులైన చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా మండలంలోని జోగంపేట జంక్షన్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అడిగర్లప్ప నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేశారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ నాయకులైన అయ్యన్నకు అరుదైన గౌరవం దక్కిందన్నారు. స్పీకర్ పదవి ఆయనకు కేటాయించడం తో పార్టీలో ఆయన ప్రాముఖ్యతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంమూర్తి, సుర్ల బాబ్జి, పారేపల్లి నాగేశ్వరరావు, కొమర వోలు చిట్టిబాబు,పుల్లేటికుర్తి రమేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఇబి ఎస్ఐ రహీం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి గొలుగొండ:విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని గొలుగొండ ఎస్ఇబి ఎస్సై రహీం సూచించారు. శనివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కాలేజీలో గంజాయి, నాటు సారాతో కలిగే అనర్థాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌమార దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండి అంకితభావంతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపక బృందం, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఏజెన్సీ ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, జీవన్ కృష్ణ శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ 11 మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 6,7,8 తరగతులలో అడ్మిషన్లు లేవని హెచ్ఎంలు వెనక్కి పంపిస్తున్నారన్నారు.అడ్మిషన్ల కోసం పాఠశాల లకు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుకోవాలని ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించకుంటే ఉద్యమాని వెనకాడమని హెచ్చరించారు. ప్రతి గిరిజన పేద విద్యార్థులకు చదువుకునే హక్కును కల్పించాలన్నారు.ఈ విషయమే పిఓ స్పందించి విద్యార్థులను ప్రతి క్లాసులో హెచ్ఎంలు జాయినింగ్ చేసుకోమని తెలియజేస్తామని చెప్పారన్నారు.

ఎంపీ సిఎం రమేష్‌కు అభినందనలు



ఎంపీని సత్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:అనకాపల్లి కూటమి ఎంపీ సీఎం రమేష్‌కు స్థానిక నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో సీఎం రమేష్‌ను బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు, నాయకులు దేవవరపు లోవరాజు, నడిగట్ల అప్పన్న తదితరులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

-దేవరాపల్లి : అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్‌ను అనకాపల్లి బీజేపీ కార్యాలయంలో శనివారం దేవరాపల్లి మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షుడు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తితో పాటు పలువురు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవరాపల్లి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.

పాఠశాల భవనం నిర్మించాలని.. విద్యార్థుల వినూత్న నిరసన



నిరసన చేపడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- అనంతగిరి:పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తక్షణమే ప్రభుత్వం భవనం నిర్మించి తమకు రక్షణ కల్పించాలని విద్యార్థులు వేడుకున్నారు. మోకాళ్ళపై విద్యార్థులు చేతులు జోడించి తమ ఆవేదనను వెలిబుచ్చారు. మండలంలోని వెంగడ పంచాయతీ పరిధి డొంకపుట్టు గ్రామ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఇదిలా ఉండగా పాఠశాల భవనం లేక రేకుల షెడ్డులో నాలుగు గ్రామాలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు విద్యా బోధనలు కొనసాగిస్తున్నారు. ఆ గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు రెండు దపాలుగా నిధులు మంజూరైనప్పటికీ పనులు మధ్యలో వదిలి వేయడంతో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు వర్షాలకు పాఠశాల రేకుల షెడ్డులో వర్షపు నీరు ప్రవేశిస్తుంది. నేలపైన కూర్చో లేక ఇబ్బందులకు గురవుతన్నారు. గత వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకంతో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కోట్ల రూపాయలు నిధులు వెచ్చించింది.

కనీసం పాఠశాల భనం లేని చోట ఏర్పాటు చేసేందుకు ఎందుకు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, పలు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల భవనం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం స్పందించి నూతనంగా పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రోడ్డు నాణ్యతపై శాంపిల్స్ సేకరణ


ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఎన్నికల ముందు నిర్మించిన రోడ్డు పై శనివారం ఆర్ అండ్ బి క్వాలిటీ కంట్రోల్ అధికారులు శాంపిల్స్ సేకరించారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ సత్యభాస్కర్ ఆధ్వర్యంలో నర్సీపట్నం -కేడీపేట ఆర్ అండ్‌బి రోడ్డుపై ఆరిలోవ ప్రాంతంలో నిర్మించిన మూడున్నర కిలోమీటర్ల రోడ్డు భాగంలో ఈ శాంపిల్స్ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సత్య భాస్కర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఈ నాగమోహన్, క్వాలిటీ కంట్రోల్ జేఈ లు శ్రీనివాసరెడ్డి, రాము, ధనప్రియ, కేడీపేట సెక్షన్ జేఈ డీజీపీ ప్రసాద్ లు పాల్గొన్నారు.

28న గురుకుల రాత పరీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో (బాలికలు) 2024- 2025 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 9 వ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి ఈనెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే.సువర్ణ రత్నకుమారి శనివారం వెల్లడించారు. 6,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 22వ తేదీ నుంచి 26 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు ఫారం నకు ఆధార్, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. నక్కపల్లి గురుకులంలో ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందు (9 గంటలకు) హాజరు కావాలని, తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకుని రావాలని ప్రిన్సిపల్ సువర్ణ రత్నకుమారి తెలిపారు.



ప్రిన్సిపల్ సువర్ణ రత్న కుమారి



నగదు ఇస్తున్న తహశీల్దార్

ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేత

ప్రజాశక్తి -కోటవురట్ల:అంజన్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలలో పలువురు ఉత్తమ విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహక నగదును అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా స్థానిక తహసిల్దారు వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంజన్ కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ లో భాగంగా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ఎంపిక చేసి ఆర్థిక సహాయం తహసిల్దార్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి భాను, ప్రమీల, కృష్ణ, సహ పలువురు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:బడి ఈడు పిల్లలందరినీ బడిలోనే చేర్పించాలని వెంకటాపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లావుద్దీన్ ఆధ్వర్యాన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్స్, అమ్మకి వందనం, మధ్యాహ్న భోజన పథకం, పీఎం పోషణ, నిష్టాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పిల్లల చదువు కోసం అదనపు వ్యయాన్ని భరించి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల కారణంగా లింగంపేట పంచాయతీ శివారు గైరంపేట గ్రామం వద్ద నర్సీపట్నం కేడిపేట ప్రధాని రహదారిపై పక్కనే ఉన్న పెద్ద చింత చెట్టు విరిగిపడింది. చెట్టుకి సమీపంలో ఉన్న కారుపై కొమ్మ విరిగి పడటంతో నుజ్జునుజ్జు అయ్యింది. చెట్టు విరిగి పడటంతో ఆనుకొని ఉన్న కరెంటు వైర్లు తెగి విద్యుత్ ఒరిగింది. దీంతో ప్రజలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. చెట్టు అడ్డంగా పడటంతో ఉదయాన్నే ప్రయాణం చేసే స్కూల్ బస్సులు, ఆటోలు కొంత ఇబ్బంది పడ్డాయి.రోడ్డుపై పడిన చెట్టును సిబ్బంది తొలగించారు. విద్యుత్ సరఫరా ను పునరుద్ధరించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బొడ్డేరు

శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి తాండవ రిజర్వాయర్‌కి ప్రధాన వనరు బొడ్డేరు నది రాత్రి నుంచి ఉదయం వరకు ఉధృతంగా ప్రకటించింది. కేడీపేట సమీపంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షానికి గెడ్డలో వర్షపు నీరు చేరడంతో ఉధృతమైంది.



కారుపై పడిన చెట్టు

నాడు - నేడు



ఇనుప ఊచలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన

వంతెన రైలింగ్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం లో అల్లూరి పార్క్ సమీపంలో బొడ్డేరుపై నిర్మించిన వంతెన రైలింగ్ కొంతమేర శిథిలమైంది. దీనిపై ప్రజాశక్తిలో శిథిలమైన వంతెన శీర్షిక పేరిట వారం రోజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు శిథిలమైన రైలింగ్ ప్రాంతంలో కొత్త ఊచలు వేసి మరమ్మతులు చేశారు. దీంతో, పార్క్ కి వెళ్లే సందర్శకులు సంతోషం వ్యక్తం చేశారు.



ఇనుప ఊచలు ఏర్పాటు చేసిన దృశ్యం

జెడ్‌పిటిసి రమణమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి -కొత్తకోట:ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన రావికమతం జడ్పిటిసి తలారి రమణమ్మకు పలువురు ఘనంగా నివాళి అర్పించారు. రావికమతం మండలంలోని కొత్తకోటలోని స్వగృహం వద్ద ఆమె చిత్ర పటానికి శనివారం నివాళి అర్పించి సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్‌పిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు దొండా రాంబాబు, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్, రావికమతం ఎంపిపి పైల రాజు, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, కొత్తకోట సర్పంచ్ కొన లోవరాజు, జడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రమణమ్మ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సుభద్ర, గిరిబాబు, రాంబాబు

గ్రావెల్ తరలింపుపై

కేసులు నమోదు చేయాలి

తహశీల్దార్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలో అక్రమంగా గ్రావెల్ తరలించిన వారిపై ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని అరగలమెట్ట సాగుదారులు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రావెల్ సామాన్యులు తరలిస్తే కేసులు నమోదు చేసి జరిమానాల విధిస్తారని తెలిపారు. లేఔట్ యజమాని గ్రావెల్ తరలిస్తే ఎందుకు కేసులు పెట్టలేదని, జరిమానాలు ఎందుకు విధించ లేదని స్థానిక రైతులు ప్రశ్నించారు. ఈ విషయంపై శనివారం స్థానిక తహసిల్దార్ వద్ద విలేకరులు ప్రస్తావించగా రెండవ సారి నోటీసులు జారీ చేశామన్నారు. ఇందుకు సబంధించిన వివరాలు.. చీడికాడ మండల కేంద్రం రెవెన్యూ సర్వే నెంబర్ 119, 120లలో జిరాయితి భూమిని విశాఖకు చెందిన ఓ కార్పొరేటర్ కొనుగోలు చేశారు. ఆ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేశారు. లే అవుట్లు వేసేందుకు రహదారులు నిర్మించినందుకు గాను ఆ పక్కనే గల అరగలమెట్టను తవ్వి మెట్టకు సంబంధించిన గ్రావెల్‌ను తరలించి రహదారులను నిర్మించుకున్నారు.

ఈ లేఔట్ లపై ఇప్పటికే స్థానిక పాత్రికేయులు కథనాలు ప్రచురితం చేయడమే కాకుండా అక్రమ గ్రావెల్ తరలింపు పై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు లేఅవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ లేఅవుట్ల యజమానులు స్పందించక పోవడంతో రెండోసారి నోటీసులు జారీ చేయడమే కాకుండా ఎనిమిది లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు, అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులతో సర్వే చేయిస్తామని శనివారం స్థానిక కార్యాలయంలో తహసిల్దార్ ప్రకాష్‌రావు విలేకరులకు తెలిపారు.

ఇంతవరకు బాగానే ఉన్నా అక్రమ గ్రావెల్ ను తరలిస్తుండగా.. సాక్షాలు ఎదురుగా కనిపించినప్పుడు తరలింపు చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.